# కనకరాజు

పసుమర్తి కృష్ణమూర్తిశాస్త్రిగారు

కనకరాజను నొక నియోగి చిన్నవాఁడు: తలిదండ్రులకొక్కఁడు: ఒక్క చిన్న గ్రామమునకుఁ గరణము. తండ్రి యుండినపుడే, చిన్నతనముననే పెండిలి యైనది. భార్య నిన్నమొన్ననే కాఁపురమునకు వచ్చి యున్నది: చాల చక్కనిపిల్ల. ఒక చిన్న సామాన్యమగు పూరియిల్లు, ఏడెనిమిది యెకరముల నేల, పదిపన్నెండు పశువులు, పాత్రసామాను మాత్రమే కనకరాజునకు జనకునివలని యాస్తి. తల్లిమాటదాఁటక 'పిల్ల'ను మల్లెపూవువలెఁ జూచుకొనుచుఁ గరణం కనకరాజు పంతులు కాఁపురముఁ జేయ నారంభించెను. పాపము పదునెనిమిదేండ్ల వాఁడు; కాని భారముమాత్రము పెద్దది. ఇఁక నుద్యోగమో, ఆదినములలోఁ గరణపు టుద్యోగము ఒకచేయి వెండియు, మరియొకచేయి బంగారమును. ఈ పడుచువాఁడు తండ్రివంటి బ్రభాజమానుఁడు కాఁడు. మంచి చురుకుగలవాఁడు! అస్సలు నియోగిబిడ్డఁడు. అప్పుడప్పుడు తల్లితో, "నాన్న యీదీ తాగనేరని వాడు! పాపము" అని విచారించును. తల్లియు నార్జితమంతుఁడగు కొడుకుం జూచుకొని సంతోషపడుట సహజమే కదా. "నాయనా, మీనాన్న అన్నాళ్లు కరిణీకం చేశారన్నమాటే కాని పట్టుమని పదితులాల తొక్క నావొంటిమీద పెట్టినపాపాన పోలేదు. నీవు మాత్రం ఆలాగ చేయకు. రత్నంలాంటిబిడ్డ, కోరి మా తమ్ముఁడు నీకిచ్చినందుకు దానిముద్దూ ముచ్చటా తీర్చు. నామాటకేఁ" అని యప్పుడప్పుడు హితోపదేశము చేయుచుండును. అది యూరకపోలేదు. ఐదాఱేఁడులగునప్పటికి 'పిల్ల' కాళ్లకు కడియాలు, అందెలు, గొలుసులు, పావడాలు, తనకట్లతావళము, వ్రేలి కుంగరమును తయారైనవి; అంతేనా! పంతులు, పదిమందిలోఁ దిరుగుచుండును గనుకఁ జేతికి గడియారమును, జెవులకు మంచి యంటుపోఁగులును జేయించుకొనెను. ఆపై సంవత్సరము దైవకటాక్షమువల్లఁ 'పిల్ల' నీళ్లు పోసుకొన్నది. పంతులు హాస్యమునకుఁ గాఁబోలు, "కొడుకును కంటే గొలుసుపేట చేయిస్తానో పిల్లా" యనెను. ఆవేళావిశేషముఁ బట్టి, హాస్యము నిజముగానే యైనది. పంతులుమాత్రము పలికి తప్పునా? బారసాలనాఁటికి గొలుసుపేటలును, బిల్లవానిచేతికిఁ జిన్న యొత్తులును జేయించెను. బంధువు లందఱును వచ్చిరి. "ఇదంతా దాని కాలిచలవయేనే యక్కా" యని పంతులుగారి మేనమామ యెంతో సంతోషించుచుండెను.

'వాఁడు' దయదలఁచిన మనుష్యుఁడు బాగుపడుట కెంతకాలము పట్టును! ఆతరువాత మరి పదేండ్లగునప్పటికిఁ గరణంగారికి మఱియొక కుమారుఁడును గుమార్తెయుఁ బుట్టిరి. పలుకుబడియా చెప్పఁదరము కాదు. ఆచుట్టుపట్టుల నెట్టివిషయము గాని వానిచెవిఁ బడకుండదు. తాసిల్దారులు, మేస్ట్రీటులు మున్నగు పెద్దపెద్ద యుద్యోగులు గూడ, నాతనికి రొంటిలోని పొడుముకాయలు. రివిన్యూ, సివిలు, క్రిమినలు వ్యవహారములలో నాతఁడు మున్ముందు నిలువఁబడవలె; లేకున్న నవి తీరవు.

పూరిల్లు పెంకుటిల్లయినది. పొలములు, తోఁటలు, దొడ్లు చెప్పఁదగినంత వృద్ధినొందినవి. వెండి బంగారములు కూడఁ దక్కువ గావు. ఇవి యన్నియు నిటులున్నవి. కాని పంతులు తల్లి మాత్రము కళ్లు మూసినది. అది యొక్కటే విచారము. పార్వతమ్మయే యిపుడింటిలోని మంచిచెడ్డ లన్నియుఁ జూచుకొన మొదలుపెట్టినది. తెచ్చి పడవేయుటయే పంతులుగారి పని: ఇంకఁ దక్కిన దంతయుఁ బార్వతమ్మదే. "ఈ దిక్కుమాలిన కరణంపని మానేస్తేనే గాని ఆయనకు తిండి వొంటపట్టదమ్మా" యని యాపె పలుమారు విసుగునొందుచుండును. "ఉండవే!! దానితరుణం రావొద్దూ? మన చేతిలో మాటలా? మనరోజులు కలిసి వస్తే నేను తాలూకాబోర్డు మెంబర్నై పోతాను; అప్పుడీకరణంపని యేలాగూ మానుకోవాలి" యని పంతులు పార్వతమ్మను

క్షేమ మీఱ ననునయించును. మగపిల్లల చదువుమాట యొక్కటే తప్ప నిఁక నాయాలుమగల కేవిధమగు చింతయును లేదు. అదియును దీరినది. ఒక "మెట్రిక్యులేటు" కుదిరినాఁడు— భోజనం కాక నెల కిరువదియైదు రూపాయలు–చౌకబేరమే కదా. ఇంకఁ బిల్ల పెండ్లియా? సంబంధము సిద్ధముగా నే యున్నది.

పార్వతమ్మ నిశ్చయముగాఁ గాలిచలువ గలదియే. కాకున్న నిట్లు దినదినాభివృద్ధి నొందఁగలఁడా పంతులు? తలఁచుకొన్నట్టే తాలూకాబోర్డు మెంబరైనాఁడు. "దిక్కుమాలిన కరణంపని"కిఁ దిలోదకములివ్వఁబడెను; కాని యిప్పుడొక్క యన్నము వంట పట్టకపోవుటయే కాక నిద్దురకూడఁ బట్టుటలేదు. అయినఁ బార్వతమ్మ మాత్రము, మునుపటివలె విసుగుఁ జెందదు "రాచకార్యాల్లో తిరిగేవాళ్లకు నిద్దరపోతూవుంటే యేలాగ?" "చేయఁగల శౌర్యాలన్నీ ముందే యున్నవి. పిల్లలకు వొడుగులు కావాలి–వాళ్ల తరువాత పిల్ల పెళ్లి–తరువాత వాళ్ల పెళ్లిళ్లూ!!" "నిద్రపట్టడం మాటలా!" "ఆయన కాఁబట్టి నిభాయించుకుని వొస్తూవున్నారు; యింకొకళ్లయితే తెలిసివొచ్చును". అని యామె తనసానుభూతిఁ దెలుపుచు నప్పుడప్పుడు "కరిణేషు మంత్రీ" యనుమాటచొప్పునఁ జేయుచుండును.

ఆటగాఁ డదృష్టవంతుఁడైతే, ఆసు రెండు ఖాళ్లతో ఆట యెత్తినను గెలుచును. ఏలాగు?— అడుగున రాజు, రాణి, జాకీ, దహిలాలు కలియుటవలన. అటుల గెలుపొందినవా రెంతమంది లేరు!! ఆలాటిదే మానవునిజీవితమును. అది మనపంతులుగారియెడ నెంతయు నొప్పియున్నది. ఆతని కిల్లాలే అదృష్టదేవత; కరణీక మాసు; కలిసి వచ్చినవి జిల్లా తాలూకాబోర్డుల యందు సభ్యత్వములు మొదలగునవి. గొప్పవారితో వియ్యములు, దొరలతో నెయ్యములు, మరియు బంధుమిత్రుల తియ్యములు—ఆహాహా! యేముహూర్తమునఁ గలము పట్టినాఁడో కాని, యాబ్రాహ్మణుఁడు వ్రాసినదంతయు శాసనమే యగుచుండెను. అట్టివానికిఁ బట్టినదంతయు బంగారమగుట యాశ్చర్యమా? ఇంగ్లీషు రాదన్న లోపము లేదు. లేనే లేదు. భాగ్యదేవతకు భాషాపారుషాములతోఁ బని యుండదు. ఆమెకటాక్షమే మూలము; కాని, యది యెప్పు డెవనిపై నెందులకై పాఱునో యెవరును జెప్పఁజాలరు కదా!!

కాలక్రమమునఁ గోడం డ్రిద్దఱును వచ్చిరి. కూఁతురత్తవారింటికిఁ బోయినది. పార్వతమ్మభాగ్యమే భాగ్యము! వంట చేయుట చిరకాలముక్రిందటనే వదలిపోయినది. ఐనను, అప్పుడప్పుడాయింటికి వచ్చుచుండు పట్టవాసస్థులకుఁ దెలుఁగువారి గోంగూరపచ్చడి, అరవవాళ్ల కూటుకొళంబులు, మహారాష్ట్రుల మజ్జిగపులుసు మొదలగునవి వండి స్వయముగ వడ్డించును. ఐశ్వర్యాభివృద్ధియైనకొలంది నందఱును రావలెననియే యామె కోరుచుండును. ఆమెయాదరణముఁ బట్టియే యాచుట్టుపట్టుల నున్న యవ్వలు వచ్చి, "ఆపనీ యీపని" చేయుచు సహాయపడి పదేసిపూఁట లుండిపోవుచుందురు. నిజమే! ఇల్లాలిమంచితనమే, యింటికి వాసనఁ దెచ్చునది. హిందూసంఘమునకు సారమే యిల్లాలు.

మనకనకరాజుపంతు లీరీతిగ నేఁబదితొమ్మిదేఁడులు గడపెను. అఱువదియవయేఁడును వచ్చెను. అంతవఱ కాయింట నొకయెలుకయైనను బాధ నొందియుండలేదు. ముత్తమిూఁద సుజనుఁడనియే వాడుకపడినాఁడు. కాఁబట్టి యిట్టివానికి షష్టిపూర్తిమహోత్సవముఁ జేయుటకు బంధుమిత్రు లంద ఱేకగ్రీవముగా నిశ్చయించిరి. తిథివారసుముహూర్తములును నిశ్చయింపఁబడెను. బంధుమిత్రులకు శుభలేఖలు వ్రాయఁబడెను.— పుష్యశుద్ధపంచమీ భానువారమునాఁటికి. ఇదియును బెండ్లివంటిదే కదా! అంతకంటె నింక నెక్కువయే యనవచ్చును. పార్వతమ్మకొఱకు బనారసు పట్టుచీరయు, బంగారపువంకెలును సిద్ధమైనవి. ఇటులే తక్కినవారికిని యథోచితాలంకారములును, పట్టుబట్టలును సిద్ధము చేయఁబడెను. బంధువు లందఱును ద్వితీయ–నాఁటికే వచ్చి యిల్లు నిండిరి. బహుదూరాగ్రహారములనుండి బ్రాహ్మణసమూహములును విచ్చేయుచుండెను. పంచమియు వచ్చినది. ఆనాఁడు, తెల్లని పార్వతమ్మ యెఱ్ఱని పట్టుచీరఁ

గట్టుకొని, నల్లని బనారసురవికపైఁ బచ్చని బంగారు వంకెలు పెట్టుకొని పంతులుగారిప్రక్కఁ గూరుచుండెను. ఆనాఁ డాదంపతులఁ జూచి యానందింపనివాఁ డుండఁడు కదా! నాగరకత నియోగులసొమ్ము. ఆపసవ్రు, ఆకుంకుమబొట్టు, ఆకాటుక, ఆకొప్పుముడి, ఆచీరకట్టు, అమట్టు!! ఆహా! యెంత చూచినను దనివి తీరదు. ఒడిఁ జేరి దుడుకుఁదనముఁ జేయు మనుమని సవరించుచుఁ గూఁతుతో నల్లునితోఁ గొడుకులతోఁ గోడండ్రతోఁ గులదేవతవలెఁ దనప్రక్కనున్న యాజాయను జూచుకొనుచుఁ బంతులు, పడుచుఁదనపు ముచ్చటలు జ్ఞాపకము వచ్చి పరవశుఁడై కాఁబోలు పండుమీసములు పట్టుపట్టి దిద్దుకొనుచుండెను. బ్రాహ్మణాశీర్వాద మైనవెనుక నొకరూపాయ మొదలు పదిరూపాయలవఱకు యోగ్యతానుసారముగ విప్రసంభావన లీయఁబడెను. పంచభక్ష్య పరమాన్నములతోఁ బీఁటలు వంగునట్లు భోజనము లొనరించి, చేవుమని త్రేన్చుచు నందఱు లేవలేక లేచిరి. ఆయజమాను లిరువురు మాత్రము మిగిలియుండిరి. అట్టియెడ నకస్మాత్తుగ "భవతి భిక్షాం దేహి" యని వీధిలోనుండి వినఁబడెను. వెంటనే పంతులు వీధి తలుపుఁ దెఱచి చూచెను; వచ్చియున్న యతఁ డొకసన్న్యాసి. పంతులు చేతులు జోడించుకొనుచు "స్వామీ, దయచేయుఁడు" అని లోనికిఁ దోడ్కొనిపోయెను.

దంపతు లిరువురును భోజనము సేయకుండుట మంచిదే యైనది. వారిరువురు సన్న్యాసిపాదములఁ గడిగి చక్కఁగాఁ దుడిచి, యాతనిఁ దోడి తెచ్చి వెండిపూవుల పీఁటపైఁ గూరుచుండఁ బెట్టిరి. "మీ రుభయులుఁ గూడఁ గూరుచొని భుజింపవచ్చును. నా కదియిష్ట" మని స్వామి యానతిచ్చెను; కాఁబట్టి యది యట్టులె జరిగెను. స్వామి కాలము తీరినవాఁడే; మంచి స్ఫురద్రూపి; ముఖమున మంచి తేజస్సు గలవాఁడు. "నాయనా, మీరు జ్ఞానధనము నార్జించుకొంట కిది మొదలు పాటుపడుదురు గాక! ఇది భగవదాజ్ఞ" యని యీ మాటలు మాత్రమే యాతనినోట వచ్చినవి. మరియొక మాట యేదియు లేదు. పదిమంది పదివిధముల బహు ప్రశ్నలు వేయఁజొచ్చిరి కాని యాతఁడు మారువలుక లేదు. భోజనమైనను, గొంచెము మజ్జిగయు నన్నమును, ఒకటిరెం డరఁటిపండ్లు తప్ప మరేమియుఁ దినలేదు. లడ్డు, పరమాన్నము, చద్ది, పెరుఁగుగారెలు, సూరలు, పచ్చళ్లు మొదలగునవి పెట్టినవి పెట్టినట్టే యుండెను. భోజనానంతరము వెంటనే యాసన్న్యాసి, "శ్రీమన్నారాయణ" యనుచు వీథిలోనికే తిన్నఁగ నడచుచుండెను. యజమానులును వెంటనంటి యుండిరి. "నేఁ జెప్పినది జ్ఞాపకముండునని నానమ్మకము: మంచిది" యని గడప దిగి యాదంపతులఁ జూచి, బిరబిరఁ దనదారిం బోయెను.

సరియే. ఇది యైనతరువాత మరియొకటి రెండు నెలల కాయింట నత్తకును బెద్దకోడలికిని హారిః ఓమ్మని యారంభమైనది తగ వొకటి—అత్తగారి నగలన్నియు నాఁడపడుచునకేనా యని. అది రాఁజిరాఁజి పొగగమ్మి భగ్గున మండి కుండ పగులఁగొట్టినది. పెద్దబాబు తన వంతుఁ బుచ్చుకొని యత్తవారిపొత్తునకుఁ బోయెను. కాల మంతయు నొకరీతిగఁ గడచుట యెంతవానికి!! ఇఁకఁ జిన్నబాబో—చెన్నపురిలో నొకభీమాకంపెనీకి ఏజంటుగా నుండఁగోరి యైదువేలు ధరావత్తు కట్టి, భార్యతోఁ గూడఁ బట్టమునకుఁ బోయెను. పంతులుగారి కింక దిక్కెవరు? భావమఱఁది యొకఁడు, బహుకుటుంబికుఁడు, పిల్లలతో వచ్చి యక్కగారియాశ్రయమున నుండఁగోరెను. ఇదివఱకు గుమాస్తాలుగా నున్నవారు మరియొకచోట వడ్డివ్యాపారముఁ జేసికొనఁ బోయిరి. పశువు లొకటివెనుక నొకటిగ బలహీనములై వ్యాధి కాహుతము లైనవి. ఆభార్యాభర్త లిట్టియెడ సన్న్యాసినిఁ బలుమారులు తలఁచుకొనుచుండఁజొచ్చిరి. ఇది యంతయు నొకయెత్తు: పెద్దబాబువలని విచార మొక్కటియు నొక్కయెత్తు వంతులు సరిగా వేయఁబడలేదని వాఁడు తండ్రికి రిజిష్టరీయుత్తరముల వ్రాసి వ్రాసి చివరకు దావా వేసెను. చిన్నబాబుమాత్రము తండ్రికిఁ బ్రతికూలముగా నుండక యప్పుడప్పుడు తనకుఁ గావలసి వచ్చుచుండిన వందయో రెండువందలో యాతనికడ నుండి తెప్పించుకొనుచుఁ దనజీతబత్తెములతో నెట్టెటులో బ్రతుకుచుండెను.

ఇటులఁ జెప్పవలయుననిన నెంతయో యుండును గదా! అది యంతయు నేల? అదృష్టదేవత యాతని నంతతో విడిచెనని చెప్పుట చాలు. ఇంకఁ బూవులు ముడిచిన యారఁ గట్టె లమ్ముట శెట్టివాఁడైన నిష్ట పడునా? అటులని మరేమి చేయవచ్చును? అఱువది యేడు సంవత్సరములు దాఁటుచున్నవే! అక్కటా! మూఁడుదశ లెవ్వఁడైన నెట్టులైనఁ గడుపుకోఁగలఁడు; కాని ముసలితనము మాత్రము—రామరామా—యెట్టివారి నైనను జుట్టు పట్టి వంచును. అది పండ్లులేనిపులి!! చప్పున నమలి మ్రింగిన బాధ లేదు. కాని, యది యట్లు చేయదు. చప్పరించి చప్పరించి, పిప్పిచేసి పిండి పిండి యావల మెల్లమెల్లఁగ దిగమ్రింగును. అట్టియెడ శరణ్య మేది? జ్ఞానము. అది యప్పటి కప్పుడు వచ్చునది కాదు. తెచ్చిపెట్టుకొందా మన్నను ఇముడదు. కాఁబట్టి యే కన్ను గలిగి, కాలుసేతులు గట్టిగా నున్నపుడే పట్టు పట్టి దానిని సంపాదింపవలయును. వివేకు లటులే చేయుదురు.

ఇదియా ప్రపంచక మని వా రప్పటినుండి యను కొన సాగిరి. అంతే కాదు: అంకయుఁ బోయినది. పోఁగా మిగిలినే యాయిల్లును గనిపెట్టుకొనియున్న యా బావమఱఁది కిచ్చి, పంతులు భార్యను వెంటఁ బెట్టుకొని భద్రాచలము దారిఁ బట్టెను. కొన్ని మాసములకు వారు రాజమహేంద్రవరముఁ జేరి యొకసత్రములో బసచేసియుండిరి. ఒకటిరెండు దినము లైన తరువాత నొకశెట్టి యాసత్రమునకు వచ్చి యాత్రికుల నందఱినిఁ జూచుకొని, వా రున్నయెడకు వచ్చెను. ఆతఁడా భార్యాభర్తలను జూచి, యేదియో యడుగఁబోయెను; గాని, యేలనో యడుగలేదు. వారును ఆతనివైపుఁ జూచియుఁ జూడనట్లూరకుండిరి. శెట్టి మరి యైదుపది నిముసము లచ్చటనే యుండి యింటికిఁ బోయెను.

ఒకయరగంట యైనతరువాత నాతఁడు తనయిల్లాలితోఁ గూడ వచ్చి, "బాబూ, తా ముభయులును మాబసకు దయచేయండి. నే నిందాకానే చెప్పుదును కాని అమ్మగారిని పిలుచుట కెవరూ లేరని యింటికి వెళ్లి మళ్లీ వచ్చాను" అని యాబ్రాహ్మణుని గోరెను. శెట్టిభార్యయుఁ బార్వతమ్మను బహు మరియాదగ, రమ్మని బ్రతిమాలెను. నవరత్నములకు వెల నిర్ణయింప వచ్చుఁ గాని నరునకు వెల నిర్ణయింపలేముకదా. ఆ వైశ్యదంపతులయాహ్వానము నంగీకరించి, పంతులును భార్యయు వారియింటికిఁ బోయిరి. శెట్టియును దన యింటి పొరుగుననే యున్న తనచిన్నయింటిలో వారిని దింపి, వారికిఁ గావలసియున్న దంతయు నిచ్చుటకుఁ దనగుమాస్తాను నియమించెను.

మూఁడునాలుగు దినము లైన వెనుకఁ, బంతులు శెట్టి యొద్ద సెలవు దీసుకొని, భద్రాచలయాత్ర సాగింప నెంచెను; కాని, శెట్టి విధేయుఁడై, "మంచిది: వెళ్ల వచ్చును— మన మందఱమును గలసియే వెళ్లుదాం లెండి, చైత్రమాసం రానియ్యండి. అంతవరకూ మీరు దయ చేసి యిక్కడనే యుండమని నామనవి" యని యత్యంత ప్రేమఁ జూపెను. పంతులు వెంటనే యేమియుఁ జెప్పలేక యూరకుండెను; కాని, మరి యొకటి రెండు దినము లైన తరువాత నాతఁడు శెట్టిని గలసికొని, "అయ్యా, మీ రెందుకీ శ్రమ పడుచున్నారో నాకు తెలియదు. నాకు చాలా కష్టముగా నున్నది మనసులో" ననుచు, నేమేమో యింకను జెప్పఁబోవుచుండెను. శెట్టి దాని కభ్యంతరము కలిగించి, "మీ రేమీ విచారించ వద్దు. నేను మీ రెవరో బాగుగా యెఱుగుదును; కాని, మీరు నన్నెరగరు. నేను తమ యింట్లో— ఒకప్పుడు వేరుశెనగకాయల బేరమునకు వచ్చినప్పుడు, తమయింట్లో మూడునాలుగుపూట లున్నాను. ఆయమ్మగారి యాదరణమూ, ఆమెగారు పెట్టిన యన్నమూ మరచిపోలేను. మీ రప్పుడూళ్లో లేరు. ఎందుకు లేండి యిప్పుడదంతా" అని కటకటఁబడి కంట నీరు విడిచెను. పంతులు తల వంచుకొని యూరకుండెను. శెట్టియుఁ గొంచముసే పూరకుండి మరల, "అబ్బాయి లిద్దరు బాగున్నారా బాబూ" యని యడిగెను. ఈప్రశ్నవలనఁ బంతు లించుక చకితుఁడై, "నాయనా, యెందుకా ప్రశ్న? ఏమని చెప్పగలను? నాతో వేరుపడి నామీద వ్యాజ్యములు వేసి నన్ను కోర్టు కీడ్పించి ఆఖరి కత్తవారిపంచను చచ్చినాడు పెద్దవాడు. చిన్నవాడు చెన్నాపట్టంలో నుండెను.

ఏమైనాడో తెలియదు—ఇంకా నా కెందుకు వాళ్ల యేడుపు?" అని యొక పెద్దనిట్టూరుపు విడిచెను. ఆనాఁటి కా ప్రసంగము చాలింపఁబడెను.

ఆవెనుక మరియొకటిరెండుమారు లిట్టిసంభాషణలు జరిగెను. దానివలన శెట్టికిని పంతులుగారికి నొక యపూర్వానుబంధము సంభవించెను. మరియు రాను రాను బంతులు మునుపటిపంతులుఁ గాఁడు: మారిపోవుచున్నాఁడు. ఇపు డాదంపతులమోములు, సంతోషముఁ గురియుచుండును. ఇరువురును బ్రాతఃకాలముననే గోదావరిలో స్నాన మొనరించి వత్తురు: ఆవెనుక, గీతాపారాయణము: ఆవెనుక వంటయు భోజనము: తరువాత నించుక విశ్రాంతి: యనంతరము శెట్టిగారి చావడిలో నాతఁడు పురాణకాలక్షేపముఁ జేయును. అదియైన తరువాత శెట్టి కొట్టుమీఁదఁ బనిఁ జూచుకొనఁ బోవును. బ్రాహ్మణుఁడు గోదావరియొడ్డునకుఁ బోయి దీపారాధన చేయునంతవఱకచటఁ గూరుచొని యుండును. పార్వతమ్మ పురాణ మైనవెనుకఁ గొంచెము సేపు పాటలు పాడును. ఆయమ్మ పాడుచుండెడి యధ్యాత్మరామాయణ కీర్తనలను వినుటకు దూరవీధుల నుండియును బెక్కండ్రు స్త్రీలు వచ్చుచుందురు. అది నిజముగ నాధ్యాత్మిక గానమే కాఁబట్టి యట్టి యాకర్షణశక్తి దానియం దున్నది. అది యైనతరువాత, నచట నున్నవారందఱును గలసి లక్ష్మీపూజ సేయుదురు. ఆపనియం ఇదివఱ కారితేరియున్నదే కాదా పార్వతమ్మ. అందువలన నిపు డామె యకార్యమునఁ బౌరోహిత్యము తనపైఁ బెట్టుకొనినది; కాని యప్పటికిని ఇప్పటికిని భేదముమాత్ర మొకటి యున్నది:—అప్పు డామె తన కుండిన నగల నన్నిటినిఁ బెట్టి పూజ సేయుచుండినది: ఇప్పు డది లేదు; అప్పు డామె స్వార్థపరురాలు: ఇప్పుడన్ననో లోకకళ్యాణముఁ గోరుచున్నది. సరే! యిది యైనవెనుక నెవరిండ్లకు వారు పోదురు. పార్వతమ్మయు నింటికి వచ్చును. అంతలో నాముసలాయనయు గోదావరినుండి యింటికి వచ్చును. రాత్రి వా రిరువురును భుజింపరు. కాఁబట్టి మరల వంటలేదు. నిద్రవచ్చువఱకు హాయిగా నేదోయొక సత్కాలక్షేపముఁ జేయుదురు.

ఉదారబుద్ధియగు శెట్టియాదరణమున వా రిట్లు జీవయాత్ర సేయుచుండ, నంతలోఁ జైత్రమాసము వచ్చినది. ఇదివఱ కనుకొన్నట్లు శెట్టి కుటుంబముతోఁగూడ బయలుదేఱెను. అందఱును భద్రాచలరాముని సేవించుకొని భద్రముగా మగలివచ్చిరి. కనకరాజుగా రచ్చటనే యుండఁ దలఁచిరి కాని శెట్టి యందుల కిష్టపడలేదు.

కాలక్రమమున శెట్టియైశ్వర్యము పెంపొందుచు వచ్చెను. ఇపు డాతనికిఁ గనకరాజే గురువు. ఆతని యుపదేశానుసారముగ శెట్టి యెన్నో ధర్మ కార్యములఁ జేసెను. కనకరాజుగా రొక్క శెట్టికే గురువు గాఁడు; గోదావరియొడ్డున నాతఁడు గూరుచొని యుండునపుడు యువకు లనేకు లాతనిఁ జుట్టుకొందురు. అప్పు డాతఁడు, "తల్లి దండ్రులది తీరనియప్పు", "కులవృత్తు వీడుట ముప్పు," "దాస్యము సేయుట గొప్ప తప్పు" మొదలగు నిట్టి 'యరగాకుండా' మాట లేవియో పలుకుచుండును. కొన్ని సమయములలోఁ బడవలవాండ్రు, బెస్తలు, మొదలగువారును గూడ నా ముసలివానికడకు వచ్చి దండములు పెట్టి దూరముగాఁ గూరుచుందురు. ఆతఁడును నిండుమనస్సుతో వారి నాశీర్వదించును. "నాయనా, మీరు గోదావరికి ముద్దుకొడుకులు! మీదే ధన్యజీవనము. మీరు కష్టజీవులు. అక్కరకు మాలిన జడజంభాలు లేవు మీకు. మీవిలువ మీకు తెలియదు. ఆ 'తెల్లగుడ్డలు గట్టుకొను దివ్యమూర్తులు' మిమ్ము లక్ష్యము సేయరు. అయ్యో, నిజము వారికిఁ దెలియకపోఁబట్టి కదా!! మీవంటివారు లేకున్న వారు చత్తురు. వారు లేకున్న మీకు నష్టము లేదు. సృష్టిలో నెండ వానలు మీకొఱకే కాని వారికొఱకుఁ గాదు; కాఁబట్టి వారు గొడుగు లడ్డుపెట్టుకొందురు. చలి వారిని విడువదు. వారు దుప్పటులలోఁ గట్టి దానినిఁ బెంచుచున్నారు. మీ కవి లేవు కాఁబట్టి యా పెనుభూతము మీ కొక జోతఁబెట్టి పోయినది. ఇఁక రోగములో—మీ పేరు విన్నంతమాత్రమున దూరముగా పోవును! వారినో-విడువవు. వారు వాటికి మంచాలు వేసి మరియాదా చేయుదురు. ఇంతేల, నాయనా, మీవంటివారి బ్రతుకులు తలఁచుకొన్న కొలఁది, నా కేడుపు వచ్చుచున్నది. నే

న్యగవర్ణము గలవాఁడ నను దురభిమానము నిదే త్రెంచు కొనుచున్నాను—" అనుచు నొకనాఁడా బ్రాహ్మణుఁడు పెద్ద యావేశము నొంది జందెమును ద్రెంచి గోదావరిలోఁ బాఱవై చెను.

నిజమే! "జగ మెఱిఁగిన బ్రాహ్మణునకు జందెం బేలా" యని యనుశ్రుతముగా వినుచున్న మాట నిజమే!! కాని లోకులో—? యోగ్యతాయోగ్యతలఁ జూడరే!...

'నాస్తికుఁడు', 'ముసలి కొంగ,' 'కరభ్రష్టుఁడు', 'బోసిపులి' మొదలగు నిట్టిమాటల కెన్నిటికో గురియైనాఁడు కదా పాప మా ముసలివాఁడు! వినలేక శెట్టికిఁ జెవులు చిల్లులుపడినవి. "ఇతడ్ని పంపించండి అవతలి కింక", "ఇతనిగాలి సోఁకితే, సచేలస్నాన మాచరేత్" అను నీమాటలే, శెట్టి యెవనినోటనుండి విన్నను. శెట్టి స్థిరచిత్తుఁడు కాఁబట్టి సరిపోయినది గాని, లేకున్న కనకాచలంగారి కథ కంచికి వెళ్లవలసినదే యీపాటికి! ఇంక నీ "మాకాశపతనవ్యవహారము"లోఁ బార్వతమ్మ మాత్రము పడక తప్పుకొన వశమా? అమ్మలక్క లూరకుందురా!!—కాని యెంత యెంత కేమేమి యనుచున్నను, ఆభార్యాభర్తలు మాత్రము నోరెత్తరైరి! అదియును తప్పేకదా! "చేయరానిపని చేసి మీఁదుమిక్కిలి మౌనముద్రయా?" "అంతకంటె మరే ముండును?"—

మార్కండేయస్వామివారి యాలయములో వైదిక సభ చేయ నిశ్చయింపఁబడెను. దినవారములను నిర్ణయించుకొనిరి. శ్రీ మచ్ఛంకరాచార్యులవారి కీవృత్తాంతము వ్రాయఁబడెను. ఈగడబిడ లన్నియుఁ జూచి శెట్టి యూరకుండెను. కులమునుండి వెలివేయుదు మను బెదరింపు లాతనికిని వినఁబడినవి. తప్పలేదు. కాని, యాతఁడు కదలలేదు. "వైదికసభవారు నిర్ణయించిన ప్రాయశ్చిత్తమును చేయించుకొని మాదివ్యపాదుకలకు నూటపదహార్లు అపరాధముగా చెల్లించునది" యని స్వాములవారి శ్రీముఖము కనకరాజుగారికిని సభాధిపతులకును వచ్చినది. సభవారు దాని నూరేగించిరి. కనకరాజుగారు శెట్టికి దానిం జూపి చింపివై చెను. శెట్టి యాతనికాళ్లపైఁబడి, "మీరు పెద్దలు, మీకు తెలియనిది లేదు. కాని, నామనవి వినండి; నే నానూటపదార్లు పంపుకోగలను. మీ కేల యీరట్టు? ప్రాయశ్చిత్తము చేయించుకోరాదా" యని యింక నేమో చెప్పఁబోవుచుండెను; కాని, కనకరాజుగారు వారించి యిట్లనిరి:—"నాయనా, నేను ప్రాయశ్చిత్తము నే చేసుకొన్నాను. కూటికై కులవృత్తిని గూల్చిన గూళకు జన్నిదమా? అంతరాత్మను వంచింపు మందువా? వద్దు. మోసపోకు. ధర్మమే గొడుగు, పాప మే పిడుగు. రేపే కదా సభ. నాతో రమ్ము; నాయుదంతము—నిజమైనది—విందువు. నా బ్రతుకును, నాసంసారమును, నీవు చూచియుంటివేమో! నీవు చూచినదానికిని, వినినదానికిని, అచ్చమైన సత్యమునకును ఎంత వారడి యుండునో నీకే యెఱుకపడఁగలదు. గొఱ్ఱెదాఁటు బేరము వద్దు. పరమేశ్వరుఁడు నీయంతరాత్మలో నున్నాఁడు. వానిని మెప్పించి తిరుగు: సన్న్యాసులకు నూటపదార్లిచ్చుసమయము కా దిది" యని. శెట్టి మరియేమియు ననలేదు.

మఱునాఁడు మధ్యాహ్నము మూఁడుగంట లగునప్పటికే మార్కండేయస్వామి యాలయమునకు జనులు గుంపులుగుంపులుగా బయలుదేఱిరి—వేడుక కదా! నాలుగుగంటలకు సభ యారంభింపఁబడనున్న దనఁగాఁ గనకరాజుగారును, శెట్టియును, వారి ననుసరించినవారు మరి యొకగుంపును లోనఁ బ్రవేశించిరి. మరి యెట్టియాలస్యము సేయ నేల యని పంతులు, వెంటనే పైనున్న బట్ట నడుమునకుఁ జుట్టుకొని, యగ్రపీఠమును సమీపించి చేతులు ముడుచుకొని యిటు లుపన్యసింపఁదొడఁగెను:—

"మహాజనులారా,

"మీయందఱికిని నమస్కారములు. మీకుఁగల మతాభిమానమునకు నే నెంతో సంతోషపడుచున్నాను. మీ కూరక శ్రమ కలుగ నేల యని నేను ముందుగా వచ్చియున్నందుకు నన్ను మన్నించండి. నాకథ నేను వినిపించవలయునని యిచట నిలువఁబడి యున్నాను. నామాటలు విని యావెనుక మీయిష్టము వచ్చినట్లు మాటాడుకో వచ్చును.

"నాజీవిత మెటు లుండెనో యది యెఱిఁగి యున్నవారు కొంతమంది యీసభయం దున్నారని నే నెఱుఁగుదును. నా కెఱిఁగియున్నది కేవలము నాబాహ్య చరిత్ర. అది కాదు నేను మీతో చెప్పవలసియున్నది. నాయంతశ్చరిత్రమునే నేను చెప్ప నిశ్చయించుకొన్నాను దీనిని చెప్పుటవలన నా కేదియో లేనిపోని యొకగుణమో దోషమో యారోపించవద్దని నామనవి. నేను పడుచున్న పశ్చాత్తాపము వెలిఁబుచ్చి పదిమందిలో నాపాపములను బోఁగొట్టుకొనుటయే నాముఖ్యోద్దేశము. ఇంక మీయిష్టము. ఇదిగో వినుండు.

"నే నొక చిన్నయూరికిఁ గరణమునై యుంటిని. నాతండ్రి యుంచినదానితో నా కేమాత్రపు తృప్తియును కలుగలేదు. కాఁబట్టి నేను డబ్బు మూటగట్టుటకు నిశ్చయించుకొంటిని. అప్పటినుండి యారంభించితిని నాలౌక్య మంతయు:—అమాయికులగు రైతుల కళ్లలో దుమ్ముగొట్టితిని: తలలు మార్చితిని: తగవులు పెంచితిని: దొంగదస్తావేజులు పుట్టించితిని. నేను ముట్టించినకొంప లింకను మండుచుండును. అయ్యా, ప్రజాసేవఁ జేయుదునని తాలూకాబోర్డులో తలఁబెట్టితిని. కష్టజీవులగు ప్రజలసొమ్ము పప్పుబెల్లములవలె తినుచుంటిని. నే నాడుచుండిన దంతయు బొంకే; చేయుచుండినదంతయు స్వలాభము కొఱకే!! నా పెద్దమనిషితరహా, యిది. ద్రోహము, వంచన, అసత్యము, అప్రమాణము—ఇవి నా పెద్దమనిషితరహాకు ముఖ్యలక్షణములు. విన్నారా—ఇదియే లౌక్యము! ఇఁక నావైదికమో?—నే నెన్నఁడు గాని నన్ను పొగడని బాపనయ్య కొకదమ్మిడి యివ్వలేదు. దంభముతో సంతర్పణలు చేసితిని. అహంకారముతో నే దినములు వెళ్లఁబుచ్చితిని గాని మరియొక సుగుణమునకై యాశించియుండలేదు. ఇది యంతయు దేని కొఱకు?—డబ్బుకొఱకు. సరియే—యేఁబదివేలు గడించితిని—తృప్తి తీరినదా?—లేదు! మీఁదుమిక్కిలి నాకొడుకే నాకు శత్రువై న్యాయస్థానముల కీడ్చినాఁడు. నాషష్టిపూర్తితో నాపాపపూర్తి యైనది. అది యెట్లు వచ్చినదో యట్లే పోయినది. ఆడబ్బు పోవుటయే మంచిది యైనది. రాత్రులయందు నిద్ర పట్టించినది కాదు. అన్నము దిననిచ్చినది కాదు! అయ్యయ్యో. ఇఁక నాభార్య, అదిగో—నాభార్య!! నగ లన్నియును పోయినతరువాతనే మాకు నిజమైన పరస్పరప్రేమ కలిగినది. అంతకు ముందో?—న న్నామె నమ్మదు, నే నామెను నమ్మను. మా కిపుడు వివాదములే లేవు. బంధువులు మాకడకు రారు. విచారము మమ్ము విడిచి పోయినది. శెట్టిగర్మమా యని పెట్టుచున్న యన్నము నొకపూఁట దిని హాయిగ నున్నాము.

"నేను నిశ్చయముగా దేవాలయములోనికి రాఁగూడని వాఁడను—మీరు నమ్మండి, నమ్మక పొండి!! ఇటువంటినాకు జన్నిదము లేదని మీరు పరితాపపడుచున్నారా! రామరామా!! వద్దువద్దు. మా దుట కొక నూలిపోఁగే యది. ఐనను, దానియం దొకప్పు డద్భుతశక్తి యుండెడిది. ప్రస్తుతము, దుష్టికి ముఖ్యచిహ్నమే యైనను, అది పూర్వము మహాపవిత్రమై యుండెడిది. నిర్వీర్యుఁడను, అపవిత్రుఁడను, అసత్యపరుఁడను నేను: నా మెడలో నట్టిమహాసూత్ర ముండరాదు. నిజముగా నుండరాదు!! కాఁబట్టి దానిం ద్రెంచి గోదావరిలో వేసితిని. నా కెందు కిఁక దురభిమానము? వద్దు వద్దు! ఇంకనూ ఆత్మవంచనమా! చిన్నపిల్లవానిచేతికి చిక్కిన కత్తివలె, అయోగ్యుఁడనగు నాకంఠమున నుండి యా దివ్యసూత్రము నాకు బాధ కలిగించినదే!! నే నేదో గొప్పవాఁడ ననుకొనుచుంటిని. ఎవరికష్టము వలన నేను బ్రతుకుదునో యట్టి వారిని ముట్టుకొనుటకుఁ గూడ నసహ్యపడుచుంటిని!! కాయకష్టమువల్లనే కడుపు నింపుకొను పరమయోగ్యులచే కాళ్లు పట్టించుకొంటిని: కష్టపడ నిష్టము లేక "గప్పా"లు కొట్టుచుండుట నాకొక వృత్తియైనది. సిగ్గు! సిగ్గు—తలఁచుకొన్న కొలఁది రోఁత—మరి వద్దు, మరి వద్దు. నన్ను నేను సవరించుకొన్న తరువాత చూచుకొందును. ఇప్పటి కిది తగియున్నది.

"అయ్యా! ఇఁక నాకు సెలవా?- మీ కెందుకీ వృథాప్రయాసము? నాకర్మ మిది. నామర్మ మిది. ఇఁక మీధర్మ మేదో చూచుకోవచ్చును. సెలవు సెలవు!!!" అని మెల్లగా దారి చేసుకొని వచ్చి యీవలఁ బడెను.

ఇఁక మరి సభ యేల? ఎట్లు జరుగును? సదస్యులు గొల్లు పెట్టి యీవలకు వచ్చుచుండిరి. ముసలివానిని విమర్శించుటను గుఱించి వారిలో నొకఁడైనను వెనుకదీయ లేదు: మనముమాత్ర మూరకుందుమా? కల్ల!! ఐన మన ధోరణి మరియొకలా గుండవచ్చును. "పశ్చాత్తాపము కలుగుట యరుదు. పూర్వపుణ్యవశమున నది కలిగెనా, మన బ్రతుకు బంగారమే యగును. మనమే దేవతల మగుదుము" అని. కాని దురభిమానపిశాచమో?— ఇది పోతే గాని అది రాదు. అది రాకపోతే యిది పోదు. ఇంతకు నీశ్వరానుగ్రహ మున్నయెడల నన్నియుఁ దిన్నవడును.

ఆ మఱునాఁడు కనకరాజుగారు శెట్టియును దమచావడిలోఁ గూర్చొని యేదియో మాటాడుకొను చుండిరి. అప్పుడప్పుడే బజారులు తెరువఁ బడుచుండెను. అట్టియెడ నొకయువకుఁడు, తొమ్మిది పదియేఁడులు గల మరియొక బాలకుని వెంట నిడుకొని, యాచావడిలోనికి వచ్చి, "మామగారూ, నమస్కారము. నాన్నా, తాత గారికి నమస్కారం చెయ్యి" అని నిలువఁబడెను. "రండి—కూర్చోండి. నాయనా, మీ రెవ్వరు?—పోల్చలేను, మునుపటిలాగ" అని కనకరాజుగారు వారిని గూరుచుండఁబెట్టిరి.

శెట్టి— బాబూ, మన దేవూరు?

యువ— మాది విజయనగరం.

శెట్టి— ఈ అబ్బాయి మన కేం కావాలి?

యువ—నా మేనల్లుడు—అక్కకొడుకు; కనకరాజుగారి పెద్దకుమారుని కొడుకు.

కనక—ఇక్కడి కెందు కొచ్చారు నాయనా?

యువ—నే నీవూళ్లో బియ్యేక్లాసులో చదువుకుంటున్నాను; మాఅక్కయ్య కూడా నాకు సంరక్షణ కోసం వచ్చింది:— బండిలో వుంచి, పిలుచుకొస్తాను.

అని యామెను దీసికొని వచ్చెను ఆమెపేరు కమల. ఆమె ముఖమునకు సగము చాటు పెట్టుకొని మెల్లమెల్లగ వచ్చి తలుపుచాటున నిలువఁబడఁగనే కనకరాజుగారు "పార్వతీ" యని భార్యను బిలిచెను. పార్వతమ్మగారు వచ్చి చావడిలోఁ గాలు పెట్టియుఁ బెట్టక మునుపే కమల యామెకంఠమును గట్టిగఁ బట్టుకొని, "అత్తా అత్తా" యని యేడువఁ దొడంగెను. తాతగారు, "అమ్మా! యేడుస్తా వెందుకు? దైవవిలాసం. పార్వతీ! లోపలికి వెళ్లండి" యని వారిం బంపెను. శెట్టియుఁ దనకార్యములఁ జూచుకొనఁబోయెను. ఆనాఁటికి వారందఱు నచ్చట నుండిరి.

మరునాఁడుదయమునఁ దనతమ్ముఁడు బండితెచ్చి వాకిటఁబెట్టి కమలను రమ్మనెను. కాని యామె వెళ్లలేదు. తమ్ముని వంటపూఁటయింట భోజనము చేయుచుండుమని చెప్పి పంపినది; ఆనాఁటినుండియు నత్తమామలను గనిపెట్టుకొని, శెట్టికి నిజమగు సోదరియై, సుఖముగ బ్రతుక నారంభించెను. పిల్లవానికిఁ దాతగారే చదువు చెప్ప నారంభించిరి. వానిపేరును దనపేరే. హరికటాక్షమువలన వారు సుఖముగా నున్నారు. ఇటుల నొక నెలదినము లైనతరువాతఁ గమల యత్తమామలఁ గూర్చుండఁబెట్టి యిట్లనెను:—"నా తండ్రి నన్నేదో వుద్ధరిస్తానని చెప్పినమాట లన్నీ వట్టి బూటకాలు. నామనస్సులో ఆందోళనమంతా పోయింది. కాబట్టి నే నిప్పుడు మాట్లాడగలను. ఇన్నాళ్లూ మాట్లాడలేదు. నాకథ మీతో చెప్పక తీరదు. మీరు నన్ను మళ్లీ రానిస్తారని నేను కలలోకూడా అనుకోలేదు. కాని మీరు గతించినదానిని కడుపులో పెట్టుకోకుండా, సుందరమ్మనులాగే నన్నాదరించారు. పిల్లవాడెదిగితే చూదాం అని నాడబ్బంతా గుటకాయస్వాహా చేశారు మా నాన్నగారు. చివరకు మీరు రాయించి యిచ్చిన కరణపుమాన్యం మాత్రమే దక్కినది—మీ నాయనగారిదని మీరు మీపెద్దకొడుకుగారి కిచ్చింది. అదికూడా అమ్మతా నన్నాడు మా అన్నయ్య. కాని నే నొప్పుకోలేదు పిల్లవా డద్ధాన్న మైపోకుండా దైవం కాపాడి మీకంటఁ బెట్టినందుకు నేను ధన్యాత్మురాల్నే. ఆపాలం తాలూకు కాగితాలు నాదగ్గర్నే పెట్టుకున్నాను. నా కెందు కవి? మీ కడుపులోవాడే వాడు. మీపెద్దలపేరుగా వాడున్నాడు. ఇంక నేను


మీ యుభయులకు నౌకరును గాని స్వతంత్రురాలను కాను."

ఆమాట కాదంపతు లేమియు ననలేదు. పెద్ద నిట్టూరుపు విడిచి కొంతసేపటికి తాతగారు, "అమ్మా, సత్యమే జయము. చూడు, మానాయన యెంత యోగ్యుఁడో. కష్టార్జితమే నా కిచ్చినాడు: కాఁబట్టియే యది నిలిచినది. ఆహా, సర్వేశ్వరా" యనెను.

కొంతకాలముతరువాతఁ గనకరాజుగారు కండ్లు మూసిరి. వారివెనుకఁ బార్వతమ్మయుఁ గాలముచేసినది. దయావిశిష్టుఁడగు శెట్టి యాదంపతులపేరుగ నొకమఠము గట్టించెను. ఆవెనుకఁ జిన్నకనకరాజును వాని తల్లిని వారిస్వగ్రామమునకుఁ దోడ్కొనిపోయి వారియింటఁ బ్రవేశపెట్టెను. ఆయింటనుండిన వారు పార్వతమ్మగారి మఱఁదలును,ఆమెపిల్లలును. శెట్టి వారికి మరొక యిల్లాయూరనే కొనిపెట్టి వెడలిపోయెను.

కనకరాజుగారు విడిచిపెట్టిన కరణీకమును చిన్నపెద్దలసహాయమువలనఁజిన్నకనకరాజు సంపాదించుకొని, వివాహితుఁడై, తల్లిమాట దాఁటక, ధర్మము దప్పక, ఆయింటిపేరు నిలువఁబెట్టుకొనెను.

అనంతరమునఁ గొంతకాలమునకుఁ బినతండ్రియు, బినతల్లియుఁ గూడ వచ్చి యాపితృగృహమునందే తమ జీవితములఁ గడపిరి.



విఠోబాదేవాలయగోపురము, పండరిపురము